క్లుప్తంగా

కేశవస్వామివారికి బంగారు నేత్రాల అలంకరణ



తాళ్లరేవు కేశవస్వామికి అలంకరించిన బంగారు నేత్రాలు

తాళ్లరేవు: స్థానిక కేశవపురంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామికి దాత గుదిమెళ్ల రవిశేఖర్ బంగారు నేత్రాలను సమర్పించారు. ఉగాది సందర్భంగా అధికారుల సమక్షంలో అర్చకులు పెద్దింటి శ్రవణ్‌కుమార్‌కు వారు బంగారు నేత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా బంగారు నేత్రాలకు అర్చకులు సంప్రోక్షణ చేసి స్వామివారికి అలంకరించారు. సుమారు మూడు గ్రాముల బంగారు నేత్రాలను చేయించినట్లు దాత రవిశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు డింగిరభట్ల కేశవ రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యాగ మహోత్సవం

అల్లవరం: దేవగుప్తంలో కొలువైయున్న ఉమా పార్వతి సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో నక్షత్ర పూర్వక నవగ్రహ సహిత శివపంచాయతన యాగాన్ని ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వేద పండింతులు పోచినపెద్ది శ్యామ్ శర్మ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్రహ్మశ్రీ మరువాడ వేంకటేశ్వర శర్మ పర్యవేక్షణలో పోచినపెద్ది నరసింహమూర్తి ఆధ్వర్యంలో దేవగుప్తం ప్రజల సహకారంతో ఈ యాగం సాగుతుందన్నారు. సోమవారం ప్రారంభమై ఐదు రోజుల పాటు కొనసాగే ఈ యాగంలో 27 నక్షత్రాలకు నవగ్రహ జపములు, అష్టోత్తర కలశాభిషేకం, ఉమా పార్వతి మల్లేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్ర పూజ, శివ పార్వతుల శాంతి కల్యాణం, కుంకుమ పూజ నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని యాగ పుణ్య ఫలాన్ని పొందగలరని ఆయన కోరారు.

ప్యాప్టో డిప్యూటీ జనరల్ సెక్రటరీగా మునేశ్వరరావు



ప్యాప్టో కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు

ముమ్మిడివరం: ఉపాధ్యాయ సంఘాల సామాఖ్య (ప్యాప్టో) డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా జిల్లా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మునేశ్వరరావు ఎన్నికయ్యారు. అమలాపురంలో నిర్వహించిన ప్యాప్టో ఎన్నికలలో మునేశ్వరరావుతోపాటు ప్యాప్టో కార్యదర్శిగా జీవీవీ సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఎన్నికైన వీరిని ఏపీటీఎఫ్ 1938 సంఘ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యూ.వెంకటరావు, పీ మోహన్, జి.వెంకటేశ్వరరావు, గుత్తాల రవికుమార్ పాల్గొన్నారు.

లవకుశ చిత్రంలో కుశ పాత్ర ధారునికి సత్కారం



కుశ పాత్రధారి సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అమలాపురం రూరల్: పౌరాణిక చిత్రం లవకుశలో కుశ పాత్రధారి ఉయ్యూరి సుబ్రహ్మణ్యంను ఆదివారం ఘనంగా సత్కరించారు. మండలంలోని ఇమ్మిడివరప్పాడులో నూతనంగా నిర్మించిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆయన స్వామిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించి దుశ్శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

స్కోరర్ ఆఫ్ ది ఇయర్‌గా కొట్నాల



కొట్నాల పూర్ణజయచంద్ర

యానాం: యానాం పట్టణ పరిధిలో రమాబాయ్ నగర్‌కు చెందిన కొట్నాల పూర్ణజయచంద్ర క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ పాండిచ్చేరి (సీఏపీ) నుంచి స్కోరర్ ఆఫ్ ది ఇయర్–2025 అవార్డును అందుకున్నారు. ఆదివారం క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ పాండిచ్చేరి 22వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. యానాం, మాహే, పుదుచ్చేరి, కారైకల్ రీజియన్ల పరిధిలో 30 మంది స్కోరర్లు ఉన్న క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ పాండిచ్చేరిలో కొట్నాల పూర్ణజయచంద్రకు అవార్డు దక్కడంపై గ్రామ ప్రజలు, యానాం రీజియన్ క్రీడాకారులు పలువురు ఆయనను అభినందించారు.

వైభవంగా ఉగాది వేడుకలు

- సుబ్బాలమ్మ దేవస్థానానికి పోటెత్తిన భక్తులు
- ఉగాది పచ్చడి, పంచాంగాలు భక్తులకు పంపిణీ



అమలాపురం సుబ్బాలమ్మ దర్శనానికి దేవస్థానం వద్ద బారులు తీరిన భక్తులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఉగాది పర్వదినాన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకూ అమ్మవారి ఆలయం ఆవరణలో భక్తుల క్యూ లైన్లు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్ మాథుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు అందరూ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉగాది పచ్చడి, పంచాంగాలు పంపిణీ చేశారు. అమ్మవారి తీర్థం ఉదయం నుంచి సాయంత్రం వరకూ దేవస్థానం వద్ద వైభవంగా సాగింది. పట్టణం, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఈ తీర్థానికి వేల సంఖ్యలో హాజరయ్యారు. భక్తుల సహకారంతో దర్శనానికి వచ్చిన భక్తులకు నిరంతరాయంగా పులిహోర, ప్రసాదం, మజ్జిగ అందించారు. దేవస్థానం ఈవో టి.శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్యనాయుడు, కమిటీ సభ్యులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది భక్తులకు సేవలందించారు. చందన బ్రదర్స్ వస్త్రాలయం, శ్రీ రామానంద చారిటబుల్ ట్రస్ట్, జి.రామకృష్ణ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో పులిహోర, స్వీటు ప్రసాదాలు, మజ్జిగను భక్తులకు అందించారు. జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

అమలాపురం టౌన్: స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద గల ఆధ్మాత్మిక సంస్థ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ ఉగాది వేడుకలను నిర్వహించారు. సంస్థ కార్యాలయంలో శ్రీ కాశీ అన్నపూర్ణ, విశాలాక్షి, కామధేను సహిత విశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణం జరిగింది. ఎమ్మెల్యే అయితాత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

వెంకన్న దేవస్థానంలో..

అమలాపురం టౌన్: ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి పంచాంగ శ్రవణం జరిగింది. పండితులు, పంచాంగ కర్తలు స్వామి సన్నిధిలో పంచాంగంలోని రాశి,ఫలాలను వివరించారు. పట్టణ ప్రజలకు ఈ ఏడాదంతా శుభాలు జరగాలని, ఉగాది ఆశీస్సులు వారికి ఎల్లప్పుడూ ఉండాలని పండితులు ఆశీర్వదించారు. దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, వార్డు కౌన్సిలర్ గండి దేవి హారిక, ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి లక్ష్మీ నరసింహాచార్యులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆలయంలో..

మురమళ్ల: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినం పురస్కరించుకుని పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. యానం వాస్తవ్యులు బ్రహ్మశ్రీ నాగభట్ల సుబ్రహ్మణ్యశర్మ పంచాంగ శ్రవణం చేశారు. నూతన సంవత్సరం రాశి ఫలాలు, కందాయ ఫలితాలు, వ్యవసాయ స్థితిగతులను భక్తులకు వివరించారు. తొలుత ఆలయ అర్చకుడు పురోహితులు ఉగాదిని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మను స్వామివారి చిత్రపటం, శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించారు.

భక్తి శ్రద్ధలతో పంచాంగ శ్రవణం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు కేశవపురంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి ఆలయంలో ఆదివారం పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు గ్రామ పురోహితులు కందికొండ బాబీ పంచాంగ పఠనం చేసారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పెద్దింటి శ్రవణ్‌కుమార్ స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పంచాంగాలను అందజేసారు. తాళ్లరేవు ప్రధాన రహదారిలోని భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో పంచాంగ శ్రవణం జరిగింది. పాతకోరంగిలోని శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ కురంగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్ పంచాంగ శ్రవణం నిర్వహించారు.



వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న వేద పండితులు, భక్తులు

కళాసాహితి ఆధ్వర్యంలో వేడుకలు

ముమ్మిడివరం: ముమ్మిడివరం కళాసాహితి –లలిత కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రవీంద్ర పాఠశాలలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. గౌరవ ప్రధాన కార్యదర్శి పీవీఎస్ వర్మ ఆహ్వానం పలుకగా గంజి శ్రీనివాసరావు అధ్యక్షతన వహించారు. సర్వమానవ కల్యాణ విషయ ఎన్ .అబ్బులు, పలువురు కవులు, కళాసాహితీ సభ్యులు పి.విజయకుమార్, ఏవీఎస్ మాస్టారు, జనిపెల్ల సత్యనారాయణ తెలుగు సాహిత్యంలో ఉగాది గొప్పతనాన్ని వివరించారు. అనంతరం విద్యాసంస్థల అధినేత పొత్తూరి లక్ష్మీశ్రీనివాస్ ఉగాది పచ్చడి వితరణ చేశారు.



వీరేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న బ్రహ్మశ్రీ నాగభట్ల సుబ్రహ్మణ్యశర్మ



తాళ్లరేవు వేంటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా గ్రామ దేవతల ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో మందాలమ్మవారు



ముమ్మిడివరంలోని కొండాలమ్మ

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలోని మందాలమ్మవారికి ఉగాది సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

సత్తెమ్మ తల్లికి వెండి కిరీటం అలంకరణ

కాట్రేనికోన: మండలంలో ఉగాది సందర్భంగా ఆదివారం సత్తమ్మ చెట్టు గ్రామంలో వేంచేసియున్న సత్తెమ్మతల్లి తీర్థం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తమ్మ చెట్టు గ్రామానికి చెందిన భక్తులు సానబోయిన విష్ణుమూర్తి, నాగమణి దంపతులు అమ్మ వారికి వెండి కిరీటం సమర్పించారు. ఆలయ అర్చకుడు పెద్దింటి వ్యాసమూర్తిశర్మ ఆధ్వర్యంలో వెండి కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. ఏటా ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించే సత్తెమ్మతల్లి తీర్థంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొండాలమ్మ జాతర ప్రారంభం

ముమ్మిడివరం: ముమ్మిడివరం కొండాలమ్మ చింత వద్ద గల కొండాలమ్మవారి జాతర మహోత్సవాలు ఉగాది పర్వదినం ఆదివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి రోజు అమ్మవారికి కుంకుమ పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చేనెల 8న అమ్మవారి గరగ పూజ, జాతర, ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తామన్నారు. జాతరను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పెట్టా శివప్రసాద్ తెలిపారు.



సత్తెమ్మ తల్లికి వెండి కిరీటాన్ని అలంకరిస్తున్న భక్తులు

నూకాలమ్మ ఆలయంలో విశేష పూజలు

యానాం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక దరియాలతిప్పలో కొలువైన నూకాలమ్మ ఆలయంలో జాతరను పురస్కరించుకుని ఆదివారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉగాది సందర్భంగా మల్లాడి కృష్ణారావును ఆయన స్వగృహంలో పలువురు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

కవి బాలార్జునకు ఉగాది ప్రతిభా పురస్కారం

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవి, వ్యాసకర్త మాకే బాలార్జున సత్యనారాయణకు ప్రభుత్వ ఉగాది ప్రతిభా పురస్కారం లభించింది. స్థానిక కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో డీఆర్వో రాజకుమారి చేతల మీదుగా ఈ పురస్కారాన్ని బాలార్జున అందుకున్నారు. అనంతరం ఆయనను ప్రశంసాపత్రం, అభినందన జ్ఞాపిక, నగదు బహుమతి, పండిత శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో అమృత భాష పేరుతో తెలుగు భాష విశిష్టతపై కవితాగానం వినిపించినట్లు బాలార్జున తెలిపారు.

ఉగాది పురస్కారం అందుకున్న డాక్టర్ కొల్లూరి

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవి, తెలుగు పండితుడు డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడ తమ్మలపల్లి కళా క్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసిన ఉగాది పురస్కారాల్లో భాగంగా డాక్టర్ కొల్లూరి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

డాక్టర్ పైడిపాలకు ఉగాది పురస్కారం

అమలాపురానికి చెందిన కవి, సినీ పాటలు, కవుల పరిశోధకుడు డాక్టర్ పైడిపాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉగాది పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. విజయవాడ తమ్మలపల్లి కళా క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఉగాది పర్వదిన వేడుకల్లో డాక్టర్ పైడిపాల ఈ పురస్కారాన్ని అందుకున్నారు.



బాలార్జునను ఉగాది ప్రతిభా పురస్కారంతో సత్కరిస్తున్న అధికారులు

దాట్లకు కళారత్న పురస్కారం

యానాం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కళారత్న (హంస) పురస్కారాన్ని ఆదివారం సీఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా యానాంకు చెందిన ప్రముఖ కవి దాట్ల దేవదానం రాజు అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో దాట్ల దేవదానంరాజు కళారత్న పురస్కారంతో పాటు హంస ప్రతిమ, రూ.50 వేల నగదు, ప్రశంసాపత్రం, దుశ్శాలువాతో సీఎం చంద్రబాబునాయుడు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళారత్న పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని దాట్ల అన్నారు. కళారత్న పురస్కారాన్ని అందుకున్న దాట్ల దేవదానం రాజును పలువురు కవులు, ఉపాధ్యాయులు, జనవిజ్ఞాన వేదిక, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ఫ్యాక్టరీలు, షాపులు, వాణిజ్య సముదాయాల్లో పనిచేసే మహిళా కార్మికులపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి అంతర్గత ఫిర్యాదుల కమిటీని నియమించాలని కార్మికశాఖ కమిషనర్, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వై లక్ష్మీనారాయణరెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీలు, షాపులు, రెస్టారెంట్లు, మోటార్ ట్రాన్స్‌పోర్టు కంపెనీలు, భవనాలు ఇతర నిర్మాణ సంస్థల్లో పనిచేసే మహిళా కార్మికులు పది అంతకన్న ఎక్కువ మందితో అంతర్గత కమిటీలు నియమించాలన్నారు. ఆ కమిటీలో ఆర్గనైజేషన్‌లో సీనియర్ సభ్యురాలు, ఉమెన్ వెల్ఫేర్ అసోషియేషన్ నుంచి మరో ఇద్దరు సభ్యులు ఉండాలన్నారు. లైంగిక వేధింపులపై ఫిర్యాదులు పోస్టు చేయడానికి ఏర్పాటుచేసిన ఎస్–పోర్టల్‌ను ఉపయోగించుకోవాలన్నారు.

స్తంభించిన పారిశుధ్య పనులు

యానాం: యానాంలో 20 రోజులుగా పారిశుధ్య పనులు స్తంభించడంతో పట్టణమంతా దుర్గంధం వ్యాపించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆదివారం పలువురు స్థానికులు ఆందోళన వ్యక్తం చేసారు. చెత్తను వేసే కనకాలపేట డంపింగ్ యార్డులో ఆ గ్రామస్తులు వ్యర్థాలను వేయవద్దంటూ అడ్డుకోవడంతో ప్రత్యామ్నాయ స్థలాన్ని ఇప్పటివరకు సంబంధిత మున్సిపల్ అధికార యంత్రాంగం చూడకపోవడంతో రోజురోజుకూ వీధుల్లో చెత్త గుట్టల్లా పేరుకుపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పరిష్కారం కాని స్థల సమస్య

2023లో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకాల ప్రకారం చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారుచేసే విధంగా రిసోర్స్ రికవరీ ప్రాజెక్టు కోసం స్థానిక మెట్టకూరు సబ్‌స్టేషన్ పక్కనే ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూమి 1.44.38 హెక్టార్ల భూమిని సంబంధిత మున్సిపాలిటీకి బదిలీ చేసేలా లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలను 2023 నవంబర్ 31న ఇచ్చారు. ఆ విధంగా సంబంధిత విద్యుత్‌శాఖ సైతం ఆ భూమిని మున్సిపాలిటీకి బదిలీచేస్తూ స్థానిక పరిపాలనా విభాగం, పుదుచ్చేరికి లేఖ రాసారు. మెట్టకూరు పక్కనే ఉన్న గోపాల్‌నగర్ గ్రామస్తులు అక్కడ రిసోర్స్ రికవరీ ప్లాంట్ పెట్టవద్దని ప్రస్తుతం నిరసన తెలియజేస్తుండటంతో స్థల సమస్య మళ్లీ మొదటికొచ్చింది.



యానాంలో చెత్తకుప్పలు

ఇంత జరుగుతున్నా సమస్యను అధికారస్థాయిలో చక్కదిద్దాల్సిన మున్సిపల్ కమిషనర్ కొన్ని రోజుల నుంచి సెలవులో ఉండగా ఆర్ఏఓ సైతం సెలవు పెట్టి వెళ్లిపోవడంతో పారిశుధ్య సమస్యను పరిష్కరించే వారు కరువయ్యారు. మరోపక్క ఇప్పటికే డంపింగ్‌యార్డుకు స్థలం కేటాయించాలని ఎల్జీ కె కైలాష నాథన్‌కు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ రాజీనివాస్‌కు వెళ్లి వినతిపత్రం అందజేశారు. మరోవైపు పారిశుధ్య పనుల కాంట్రాక్టు సంస్థ హెచ్ఆర్ స్క్వేర్ కార్మికులకు సైతం చెత్తను ఎక్కడవేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో సైతం సావిత్రినగర్‌లో స్థలసేకరణ చేస్తే వారిసైతం అడ్డుకున్నారు. ఈ పరిస్థితిలో పుదుచ్చేరి ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వీరేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మురమళ్ల: ఉగాది పర్వదినం పురస్కరించకుని వీరేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. మే 1 నుంచి నిర్వహించే స్వామి వారి బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్య సీతారామ శర్మ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరగన్నాయని కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీ నారాయణ తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు కార్యాలయంలో లేదా దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అన్నదాన భవనంలో ఏసీలు ఏర్పాటు

వీరేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నదాన భవనంలో నాలుగు ఏసీలను ఆదివారం ప్రారంభించారు. రూ. 3 లక్షల ఆలయ నిధులతో వీటిని సమకూర్చినట్లుగా కార్యనిర్వహకాధికారి లక్ష్మీ నారాయణ తెలిపారు.



స్వామి వారి బ్రహ్మోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న కార్యనిర్వహకాధికారి లక్ష్మీనారాయణ

ఫేక్ విద్యుత్ బిల్లు సృష్టించి బురిడీ

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని ఓ షాపు సిబ్బంది విద్యుత్ శాఖ అధికారులను ఫేక్ కరెంట్ బిల్లుతో రూ.1.84 లక్షలకు బురిడీ కొట్టించారు. ఫేక్ కరెంట్ బిల్లుతో రూ.1.84 లక్షలు చెల్లించినట్లు నమ్మించేందుకు ప్రయత్నించిన ఆ షాపు సిబ్బంది నిర్వాకం విద్యుత్ శాఖ అధికారుల అంతర్గత తనిఖీల్లో బయటపడింది. షాపు విద్యుత్ శాఖకు రూ.1.84 లక్షలు విద్యుత్ బిల్లు బకాయి ఉంది. దీంతో ఆ శాఖ అధికారులు షాపు విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు. ఆ షాపు సిబ్బంది రూ.1.84 లక్షలకు ఫేక్ బిల్లు సృష్టించి దానిని చూపించి విద్యుత్ కనెక్షన్‌ను శనివారం పునరుద్ధరించుకున్నారు. అయితే విద్యుత్ శాఖకు అనుమానం వచ్చి ఈ ఫేక్ బిల్లుపై లోతుగా విచారించారు. ఆ షాపు సిబ్బంది ఫేక్ కరెంట్ బిల్లు పెట్టి విద్యుత్‌శాఖను ఉద్దేశ్యపూర్వకంగా మోసం చేయాలని భావించినట్లు అధికారులు గుర్తించారు. దీంతో కేఎఫ్‌సీ షాపుపై, దానిని నిర్వహిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానిక విద్యుత్ శాఖ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు ఫిర్యాదు చేశారని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

పీఠాధిపతి కామేశ మహర్షికి సత్కారం



పీఠాధిపతి కామేశ మహర్షిని సత్కరిస్తున్న పీఠం ప్రేమ మందిరం పిల్లలు, మహిళలు

అమలాపురం టౌన్: అమలాపురంలోని శ్రీకామాక్షీ పీఠం మహా సంస్థానం పీఠాధిపతి కామేశ మహర్షిని పీఠంలోని ప్రేమ మందిరం (ఆశ్రమం) పిల్లలు ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. పీఠాధిపతి కామేశ మహర్షి 88వ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయనను చిన్నారులు సత్కరించారు. ఉగాది రోజున పుట్టిన పీఠాధిపతి అనాథల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఆయన కలకాలం ఆరోగ్యంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ప్రేమ మందిరంలోని ఓ విద్యార్థి పీఠాధిపతి చిత్రాన్ని గీసి ఆయనకు బహూకరించారు. ఆశ్రమంలో పెరిగి వివాహం చేసుకుని వెళ్లిన మహిళలు కూడా ఈ వేడుకకు హాజరయ్యారు. ప్రేమ మందిరం అమ్మ వక్కలంక వాణి, పీఠం మేనేజర్ మత్రి దుర్గారావు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

యానాం: నియోజకవర్గ పరిధిలో వైఎస్ఆర్ నగర్‌లో తాగునీటి ఎద్దడి ఏర్పడటంతో ఆ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్పందించి ఆదివారం ఓల్డేజ్ హోమ్ ద్వారా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని పంపిణీ చేసారు. పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని ముఖ్యంగా పలు రక్షిత మంచినీటి చెరువుల్లో నీటి మట్టాలు తగ్గిపోవడం తదితర పరిణామాల నేపథ్యంలో పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని పలువురు గ్రామస్తులు మల్లాడి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ధవళేశ్వరం ఇరిగేషన్ అధికారులతో ఆయన మాట్లాడి మంచినీటి చెరువుల్లో నీరు నింపుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అప్పటి వరకు ఓల్డేజ్ హోమ్ ద్వారా ట్యాంకుల ద్వారా నీటిని పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

ప్రారంభానికి సిద్ధమైన మసీదులు

అమలాపురం టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎస్ఆర్ నిధులతో అప్పటి జిల్లా వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో రావులపాలెం మండలం వెదిరేశ్వరరం, కొమరాజులంక గ్రామాల్లో చేపట్టిన మసీదుల అభివృద్ధి పనులు ప్రస్తుతం పూర్తయ్యాయని ఆ బోర్డు జిల్లా మాజీ చైర్మన్, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. అప్పట్లో మంజూరైన సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి ప్రారంభించామన్నారు. ప్రస్తుతం ఆ రెండు మసీదులు ప్రారంభానికి సిద్ధమయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అమలాపురంలో ఖాదర్ ఓ ప్రకటన విడుదల చేశారు. నాడు నిధుల మంజూరు కృషిచేసిన అప్పటి కలెక్టర్ హిమాన్షు శుక్లా, ప్రస్తుత కలెక్టర్ మహేష్‌కుమార్‌కు, ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతల తెలిపారు. జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్లు ఎండీవై షరీఫ్, రబ్బాని, అలీషా, కర్రార్ హుస్సేన్, జాఫర్ ఆనందం వ్యక్తం చేశారు.

ముస్లింలకు మల్లాడి ఇఫ్తార్ విందు

యానాం: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షల సందర్భాన్ని పురస్కరించుకుని ముస్లింలకు ఆదివారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఇఫ్తార్ విందునిచ్చారు. ఈ సందర్భంగా చారిత్రక జామియా మసీదు, మసీదా కూబాల్లో ముస్లింలకు ఇఫ్తార్‌ను అందించారు. అనంతరం ఆయన జామియా మసీదులో మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధికి గతంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు భవిష్యత్తులోనూ అవి కొనసాగుతాయని స్పష్టం చేశారు. పలువురు ముస్లింలు ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించాలని మల్లాడి కృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు, కమిటీ సభ్యులు ఎస్ఎమ్‌కె జిలానీ, కరీమ్, జిలానీ, సుభానీ పాల్గొన్నారు.

మసీదులో ఇఫ్తార్ విందు

అమలాపురం టౌన్: పట్టణంలోని జామియా మసీదులో ఆదివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ పాల్గొన్నారు. రంజాన్ పవిత్ర మాసం ముగింపును పురస్కరించుకుని ముస్లింలందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇఫ్తార్ విందులో మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, న్యాయవాది ఎండీ అజామ్ తదితరులు పాల్గొన్నారు. ముస్లింలు తొలుత నమాజ్ చేసి అనంతరం ఉపవాస దీక్షలను విరమించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

విశ్రాంత జిల్లా జడ్జి మృతి



నల్లా రాజా ప్రసాద్‌బాబా (ఫైల్)

కాట్రేనికోన: మండలంలోని రామస్వామి తోటకు చెందిన విశ్రాంత జిల్లా న్యాయమూర్తి నల్లా రాజా ప్రసాద్‌బాబా (70) అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో మేజిస్ట్రేట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి జిల్లా జడ్జిగా పదవీ విరమణ పొందారు. గతంలో ఈయన తెనాలి, హైదరాబాద్, భీమిలి, గుడివాడ, గుడివాడ, విశాఖ పట్టణం తదితర న్యాయ స్థానాల్లో న్యాయమూర్తిగా పనిచేసారు. రాజా ప్రసాద్‌బాబాకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈయన అంత్యక్రియలు కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని రామస్వామితోటలో ఆదివారం నిర్వహించారు. ఈయన మృతి పట్ల వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, సర్పంచి గంటి వెంకట సుధాకర్, జగడం బాలయ్య సంతాపం తెలిపారు.